సాక్షి ప్రకాశం

ఆదివారం । 15 । సెప్టెంబర్ । 2024



వేర్వేరు ప్రాంతాల్లో నలుగురు ఆత్మహత్య

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో శనివారం నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. ముగ్గురు పురుషులు, ఒక వివాహిత ఉన్నారు. - 8లో..



గంజాయి ముఠా గుట్టురట్టు

గంజాయి అక్రమంగా తరలిస్తున్న 13 మంది సభ్యులతో కూడిన ముఠాను కొండపి పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 21 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
36.7/28

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

న్యూస్‌రీల్

స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు నిర్వహించాలి

ఒంగోలు సెంట్రల్: ప్రధానమంత్రి మోదీ శ్రీకారం చుట్టిన స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మహాత్మాగాంధీ జయంతి రోజు ఆయనకు నివాళులర్పించేందుకు అక్టోబర్ 2న స్వచ్ఛ భారత్ దివస్ జరుపుకుంటున్నామని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి బి.నారాయణ తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం ద్వారా ప్రజలు స్వచ్ఛందంగా వారి చుట్టుపక్కల పరిసరాలను శుభ్రం చేసుకోవాలని కోరారు. మైనార్టీ వెల్ఫేర్ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని చర్చిలు, మసీదులలో శుభ్రత కార్యక్రమాలు నిర్వహించి స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శనివారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

లోక్ అదాలత్‌లో 5 వేల కేసుల పరిష్కారం

- కక్షిదారులకు రూ.5 కోట్ల మేర పరిహారం



కక్షిదారులతో మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి శ్యాంబాబు

ఒంగోలు: జాతీయ లోక్ అదాలత్‌లో శనివారం జిల్లా వ్యాప్తంగా సుమారు 5 వేల కేసులు పరిష్కారమయ్యాయి. జిల్లాలోని అన్ని కోర్టుల్లో ఏర్పాటు చేసిన వివిధ బెంచీల ద్వారా రాజీకి అర్హత కలిగిన కేసులను పెద్ద ఎత్తున కక్షిదారులు పరిష్కరించుకున్నారు. వివిధ బెంచీల ద్వారా కక్షిదారులకు రూ.5 కోట్ల వరకు పరిహారం అందించగలిగారు. కేసుల పరిష్కారానికి బీమా సంస్థలు, పోలీసుశాఖ, బ్యాంకుల వారు సహకారం అందించారని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఎ.భారతి తెలిపారు.

నేటి నుంచి ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

ఒంగోలు: ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓవీ వీరారెడ్డి, డి.వీరాంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 14 నుంచి 17వ తేదీ వరకు కాకినాడలో నిర్వహించనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 1 నుంచి 12వ తేదీ వరకు మండల స్థాయిలో యూటీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అందులో భాగంగా జిల్లా స్థాయి పోటీలను స్థానిక డీఆర్ఆర్ఎం ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. క్రికెట్, షటిల్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, చెస్, క్యారమ్స్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో, వంద మరియు 200 మీటర్ల పరుగు పందెం, 400 మీటర్ల వాకింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. మొత్తం 12 రకాల క్రీడా పోటీల్లో జిల్లాలోని 32 మండలాల నుంచి 600 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. విజేతలకు జిల్లా, రాష్ట్ర యూటీఎఫ్ మహాసభల్లో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయుల్లో శారీరక, మానసిక ఆరోగ్యం, ఐక్యత, స్నేహభావం, సహకారం మొదలైన లక్షణాలను పెంపొందించేందుకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 క్రీడా షెడ్యూలు విడుదల

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ప్రకాశం జిల్లా విభాగం క్రీడా షెడ్యూలును అండర్-14, అండర్-17 జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.సుభద్ర, కె.వనజ శనివారం మీడియాకు విడుదల చేశారు. ఆ షెడ్యూల్ ప్రకారం ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు అన్ని మండలాల్లో, ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో, ఈ నెల 24 నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, యోగ, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నారు. 2011 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారు అండర్-14 విభాగంలో, 2008 జనవరి 1 తర్వాత జన్మించిన వారు అండర్-17 విభాగంలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. పోటీలకు హాజరయ్యే వారు తప్పనిసరిగా వారి వెంట వయసు ధ్రువీకరణ పత్రం, ఇతర నిర్ధారణ పత్రాలతో హాజరుకావాలన్నారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలతో పాటు గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు కూడా ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. వివిధ దశల్లో నిర్వహించాల్సిన పోటీలను మండల, నియోజకవర్గ కో ఆర్డినేటర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని వారు కోరారు.

మార్కాపురం మెడికల్ కాలేజీ మాకు వరం



ఇటీవల ప్రకటించిన నీట్ ఫలితాల్లో నేను క్వాలిఫై అయ్యాను. మార్కాపురంలో దాదాపు పూర్తికావచ్చిన మెడికల్ కాలేజీని త్వరగా ప్రారంభిస్తే చాలా మంది విద్యార్థులు వైద్య విద్య చదువుకునే అవకాశం ఉంది. మార్కాపురం ప్రాంతానికి మెడికల్ కాలేజీ వరం లాంటిది. మెడికల్ కాలేజీని త్వరగా ప్రారంభించాలి.

– మహమ్మద్ నిహాల్, నీట్ విద్యార్థి, మార్కాపురం




పీపీపీ విధానం దురదృష్టకరం



రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీలను పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో నిర్వహించాలనుకోవడం దురదృష్టకరం. ప్రభుత్వమే మెడికల్ కాలేజీలను కట్టి వారి ఆధ్వర్యంలోనే నిర్వహించాలి. ప్రైవేటు భాగస్వామ్యం వద్దు. పశ్చిమ ప్రకాశం ప్రాంతానికి మార్కాపురం మెడికల్ కళాశాల ఒక వరం. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా ప్రకాశం జిల్లాలో రెండో మెడికల్ కాలేజీని మార్కాపురానికి మంజూరు చేశారు. సుమారు 48 మంది స్పెషలిస్టు డాక్టర్లను, 25 నుంచి 30 మంది డాక్టర్లను, సిబ్బందిని నియమించడంతో ప్రస్తుతం రోజుకు వెయ్యి ఓపీ మార్కాపురం జీజీహెచ్‌లో నమోదవుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం మెడికల్ కళాశాల నిర్వహణ నుంచి తప్పుకోవాలని అనుకోవడం దురదృష్టకరం.

– కేపీ నాగార్జునరెడ్డి, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే

పేదల ఇళ్లపై పగ



పేదల కోసం అగ్రహారంలో ఏర్పాటు చేసిన ఇళ్ల స్థలాల లే అవుట్

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జానార్దన్ పెత్తందారి దాష్టీకాలకు అంతూపంతూ లేకుండా పోతోంది. ఆది నుంచి పేదలంటే పగ పెంచుకున్న ఆయన.. పేదలకు పక్కా ఇళ్లు దక్కకుండా ప్రతిపక్షంలో ఉండగా కుతంత్రాలు చేస్తూ వచ్చారు. అధికారంలోకి వచ్చాక కూడా అవే కుట్రలు కొనసాగిస్తున్నారు. తాజాగా కొత్త నాటకానికి తెరతీశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో యరజర్ల వద్ద 25 వేల మందికి ఇళ్ల పట్టాలిచ్చి శాటిలైట్ సిటీ నిర్మించాలని అప్పటి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సంకల్పించారు. అయితే, దామచర్ల అండ్ కో కోర్టులకెళ్లి అడ్డుకున్నారు. ఎన్ని కుట్రలు పన్నినా న్యాయపరమైన చిక్కులు సృష్టించినా.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నుంచి కోట్లాది రూపాయలు మంజూరు చేయించి నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేయించడంలో బాలినేని సఫలీకృతులయ్యారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల ఒంగోలు కార్పొరేషన్ వేదికగా పేదల ఇళ్ల పట్టాలపై విషం చిమ్మారు. కోరం లేకుండానే నిర్వహించిన సమావేశంలో నిజ నిర్ధారణ కమిటీ పేరుతో కుయుక్తులు పన్నుతున్నారు.

- ఆగని ఎమ్మెల్యే దామచర్ల దాష్టీకాలు
- అప్పట్లో కోర్టుకెళ్లి యరజర్ల వద్ద శాటిలైట్ సిటీ నిర్మాణానికి అడ్డుపుల్ల
- తాజాగా నిజనిర్ధారణ కమిటీ పేరుతో కుతంత్రం
- పేదలకు సొంతిళ్లు ఇవ్వాలని బాలినేని కృషి
- అప్పటి సీఎం జగన్‌ను ఒప్పించి రూ.231.33 కోట్లు మంజూరు
- అగ్రహారం, యరజర్ల వద్ద రైతుల నుంచి భూముల కొనుగోలు
- టీడీపీ కుట్రలను తిప్పికొట్టి వైఎస్ జగన్‌తో పట్టాల పంపిణీ
- అప్పుడు కూడా న్యాయపరమైన చిక్కులు కల్పించేందుకు టీడీపీ యత్నం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: పేదలకు ఇంటి స్థలాలు దక్కకుండా తొలి నుంచీ దామచర్ల జనార్దన్ అడ్డుతగులుతూనే ఉన్నాడు. ఆయన ఎమ్మెల్యేగా ఉండగా ఒక్కరికి కూడా ఇంటి స్థలం ఇచ్చిన దాఖలాల్లేవు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా 2020లో యరజర్ల వద్ద 866.65 ఎకరాల ప్రభుత్వ భూమిలో 24,000 ప్లాట్లను పంపిణీకి సిద్ధం చేసింది. అయితే దామచర్ల తన అనుచరులతో హైకోర్టులో పిల్ వేయించి ఆ ప్రక్రియను అడ్డుకున్నారు. ప్రైవేటు స్థలాలు కొనుగోలు చేసైనా ఇళ్ల పట్టాలిస్తానని, లేదంటే ఎన్నికల్లో పోటీ చేయబోనని బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రతిజ్ఞ చేశారు. ఇచ్చిన మాట ప్రకారం పట్టాలిచ్చేందుకు భూమి కొనుగోలు చేస్తున్న సమయంలోనూ దామచర్ల తన అనుచరులతో మరోమారు హైకోర్టులో పిల్ వేయించారు. హైకోర్టులో వారికి చుక్కెదురు కావడంతో పేదలకు పట్టాలు పంపిణీ చేసేందుకు మార్గం సుగుమమైంది. అయినా కడుపుమంట తగ్గని దామచర్ల.. పట్టాలిచ్చిన తర్వాత వాటిని దొంగవి అంటూ ప్రచారం చేయిస్తూ తన వక్రబుద్ధిని బయటపెట్టాడు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక...

2020లో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఒంగోలు నగరాన్ని యూనిట్‌గా తీసుకుని కార్పొరేషన్ పరిధిలోని అన్ని వార్డు సచివాలయాల స్థాయిలో ఇళ్లు లేని పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 23,640 దరఖాస్తులు వచ్చాయి. వాటిని ఆరు దశల్లో పరిశీలించారు. సోషల్ ఆడిట్, అభ్యంతరాల పరిశీలన పూర్తిచేసిన తర్వాత 20,209 మందిని అర్హులుగా గుర్తించారు. వారిలో ఎస్సీలు 5,105 మంది, ఎస్టీలు 615, బీసీలు 8,991 మందితో పాటు ఇతర సామాజిక వర్గాలకు చెందిన వారు 5,498 మంది లబ్ధిదారులుగా ఉన్నారు. అంతేగాకుండా ఇంకా ఎవరైనా అర్హత ఉండి ఎంపిక కాకుంటే అటువంటి వారు మళ్లీ దరఖాస్తు చేసుకుంటే వారికి నెల రోజుల్లో ఇంటి పట్టా ఇచ్చేలా కూడా ఏర్పాటు చేశారు. అర్హత ఉన్న ఏ పేదవాడు కూడా ఇల్లు లేకుండా ఉండకూడదనే సంకల్పంతో ప్రక్రియను కొనసాగించారు. కానీ, రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత ఒంగోలు నగరంలో ఇంటి స్థలాల ఊసే లేకుండా పోయింది.

ఇచ్చిన తర్వాత కూడా విషప్రచారం...

పచ్చకుట్రలను తిప్పికొట్టి పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు దొంగ పట్టాలంటూ దుర్మార్గపు ప్రచారాలను టీడీపీ నేతలు చేశారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు సచివాలయాల్లో వేలిముద్రలు తీసుకుని మరీ పక్కా రిజిస్ట్రేషన్లు చేసి ఇళ్ల స్థలాలు అందజేస్తే.. వాటిని దొంగ పట్టాలని దామచర్ల నిస్సిగ్గుగా ప్రచారం చేయడంపై ఆ పార్టీ నాయకులు, లబ్ధిదారులే ఛీ కొడుతున్నారు.

నిజ నిర్ధారణ కమిటీ అంటూ కుట్ర...

తొలి నుంచి పేదలకు ఇంటి స్థలాలు దక్కకుండా అడ్డుతగులుతూ ఉన్న దామచర్ల.. ఎన్ని కుయుక్తులు పన్నినా ఫలించలేదు. దీంతో తాజాగా అధికారాన్ని అడ్డం పెట్టుకుని నిజ నిర్ధారణ కమిటీ అంటూ కొత్త కుట్రకు తెరతీశారు. గత ఐదేళ్లుగా టీడీపీ నేతలు చేసిన కుట్రలకు ఒంగోలులోని పేదలు పక్కా ఇళ్లకు నోచుకోలేకపోయారు. కానీ, ఇచ్చిన మాట ప్రకారం ఎన్నికలకు ముందే పేదలకు రిజిస్ట్రేషన్ చేసి మరీ పట్టాలను బాలినేని అందజేశారు. పూర్తి పారదర్శకంగా పేదలకు పంపిణీ చేసిన పట్టాలపై నిజనిర్ధారణ ఏంటో దామచర్లకే తెలియాలి. కోరం లేకుండానే శుక్రవారం నిర్వహించిన ఒంగోలు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో నిజ నిర్ధారణ కమిటీ వేయాలంటూ చేసిన తీర్మానంపై పేదలు మండిపడుతున్నారు. తమకు వచ్చిన ఇళ్ల పట్టాలు రద్దవుతాయేమోనంటూ ఆందోళన చెందుతున్నారు. నీ రాజకీయ కక్షలకు పేదలను బలిచేయవద్దంటూ దామచర్లపై నగరవాసులు కన్నెర్రజేస్తున్నారు.

పేదలకు పట్టాలిచ్చి రెండు టౌన్‌షిప్పులు నిర్మించేలా...

వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ఒంగోలు నగర పరిధిలో అనువైన ప్రభుత్వ భూములు లేకపోవడంతో రైతుల నుంచి భూమి కొనుగోలు చేయాలని బాలినేని సంకల్పించారు. ఆ మేరకు ఆనాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఒప్పించారు. నగరపాలక సంస్థ పరిధిలోని ఎన్.అగ్రహారం, మల్లేశ్వరపురం, వెంగముక్కపాలెం, యరజర్ల గ్రామాల్లో 342 మంది రైతుల స్వచ్ఛంద సమ్మతితో 536.11 ఎకరాల భూమి కొనుగోలు చేశారు. అందుకుగానూ రూ.210 కోట్లు ఖర్చు చేశారు. భూమి అందజేసిన రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా అధికారులు నగదు జమ చేశారు. లే అవుట్ల అభివృద్ధికి మరో రూ.21.33 కోట్లు వెచ్చించారు. ఎన్.అగ్రహారం, మల్లేశ్వరపురం టౌన్‌షిప్‌లో 31 బ్లాకులతో ఒక టౌన్ షిప్, వెంగముక్కపాలెం, యరజర్ల గ్రామాల్లో 32 బ్లాకులతో మరో టౌన్‌షిప్ ఏర్పాటుకు సంకల్పించారు. వాటిలో 80 అడుగుల ప్రధాన రహదారులు, 30, 40, 60 అడుగుల అంతర్గత రోడ్లు ఉండేలా చర్యలు చేపట్టారు. అంతేగాకుండా టౌన్‌షిప్‌లో ప్రతి బ్లాకు వద్ద వాహనాల పార్కింగ్, డ్రైనేజీ, తాగునీరు, పాఠశాలలు, ఆస్పత్రులు, ప్రభుత్వ భవనాలు, శ్మశానవాటికలు, పార్కుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.



అగ్రహారంలో నిర్వహించిన సభలో పేదలకు పట్టాలు పంపిణీ చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

మాలలతో పెట్టుకుంటే ఖబడ్దార్

- ఎస్సీ వర్గీకరణ ముసుగులో రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు కుట్రలు
- కూటమి ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలిపేస్తాం
- దళితుల భవిష్యత్తును మోదీకి తాకట్టు పెట్టిన మంద కృష్ణ మాదిగ
- మనువాదుల కుట్రలను మాలలు తిప్పికొట్టాలి
- హలో మాల.. చలో ఒంగోలు కార్యక్రమంలో మాల సంఘాల నాయకులు పిలుపు



సభలో మాట్లాడుతున్న జడా శ్రావణ్‌కుమార్

ఒంగోలు టౌన్: ఎస్సీ వర్గీకరణ పేరుతో మాలమాదిగల మధ్య చిచ్చుపెడుతున్నారని, మొత్తం రిజర్వేషన్లనే ఎత్తివేసేందుకు కుట్రలకు పాల్పడుతున్నారని, మాలలతో పెట్టుకుంటే కూటమి ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో విసిరికొడతామని మాల సంఘాల నాయకులు హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఒంగోలులో హలో మాల.. చలో ఒంగోలు కార్యక్రమం నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ భవనం నుంచి హెచ్‌సీఎం కాలేజీ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, కాన్షీరాం, దామోదరం సంజీవయ్య విగ్రహాలకు పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అంబేడ్కర్ భవనంలో నిర్వహించిన సభలో మాల సంఘాల నాయకులు ప్రసంగించారు. జై భీమ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జడా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ దళిత జాతిని విచ్ఛిన్నం చేసేందుకు కేంద్రంలోని బీజేపీ పాలకులతో చేతులు కలిపిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు విభజించు..పాలించు సూత్రంతో కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. మాలలకు వ్యతిరేకంగా కుట్రలకు పాల్పడుతున్న ఆంధ్రప్రదేశ్‌లోని చంద్రబాబు నేతృత్వంలో గల కూటమి ప్రభుత్వాన్ని, తెలంగాణలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో బంగాళాఖాతంలో కలిపేస్తామని హెచ్చరించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, పురందేశ్వరి కూటమిని బంగాళాఖాతంలో కలపకపోతే మేము మాలజాతికి పుట్టలేదంటూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడక ముందే ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తామని చంద్రబాబు చెప్పారని, పది రోజుల ముందే తీర్పు మాకు అనుకూలంగా వస్తుందని మరో మహానుభావుడు చెప్పాడని, దీనిని బట్టి ఈ తీర్పు ఎంతగా ప్రభావితమైందో ఇట్టే అర్థంచేసుకోవచ్చని అన్నారు. ఏ విధమైన చర్చలు జరపకుండానే భారతీయ అత్యున్నత న్యాయస్థానం ముసుగులో భారతీయ జనతా పార్టీ ఈ తీర్పును రాయించి మొత్తం రిజర్వేషన్లను ఎత్తేసే కుట్రలకు తెరదీసిందని మండిపడ్డారు. సోదరుల్లా ఐక్యంగా జీవిస్తున్న 25 శాతం దళితుల మధ్య రాజకీయ లబ్ధి కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిచ్చుపెట్టారని విమర్శించారు. ఆయా వర్గాలకు రాజకీయాధికారాన్ని దూరం చేసే కుట్రలో భాగంగా సుప్రీంకోర్టు తీర్పును అడ్డంపెట్టుకుని కుచిత్రాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ కుట్రలో మందకృష్ణమాదిగ పావుగా మారి చరిత్రహీనుడిగా మిగిలిపోయాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ కుట్రల ఫలితంగానే సుప్రీంకోర్టు తీర్పు వచ్చిందనే విషయాన్ని గమనించాలన్నారు. వర్గీకరణ తీర్పు చాటున క్రిమీలేయర్ కుట్ర జరుగుతోందని, దీని వలన సమస్త ఎస్సీ, ఎస్టీ కులాలకు ముప్పు పొంచి ఉందని చెప్పారు. మంద కృష్ణ మాదిగ బానిస వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి అని, అతని కారణంగా దళిత జాతికి చెందిన కులాలన్నీ నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ వారసులుగా రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడాలని, మనువాదుల కుట్రలను మాలలు ముందుండి ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ వర్గీకరణతో మేలు జరుగుతుందని మాదిగ సోదరులు సంబరపడిపోతున్నారని, నిజానికి క్రిమీలేయర్ ముప్పును పసిగట్టలేకపోతున్నారని చెప్పారు. ప్రశ్నించే, ఉద్యమించే మాలలంటే అందరికీ అక్కసేనని, దళితుల ఐక్యతను దెబ్బతీసే కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మాలలతో పెట్టుకున్న రాజకీయ పార్టీలు దెబ్బతినక తప్పదని మాల మహిళా సంఘ జాతీయ అధ్యక్షురాలు మంచ రాజేశ్వరి హెచ్చరించారు. ఒంగోలు సభ మొత్తం రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందని అన్నారు. సభకు మాల ఉద్యోగుల సంఘ నాయకుడు గోపీనాథ్ అధ్యక్షత వహించగా, మాల మహాసభ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు, దళిత నాయకులు నీలం నాగేంద్రం, చప్పిడి వెంగళరావు, మాల ఉద్యోగ సంఘాల నాయకులు తుల్లమల్లి అశోక్, థామస్, న్యాయవాది బాబూరావు, యరమాల మల్లికార్జున, పిల్లి మాల్యాద్రి, మేడిది రవి, జాలయ్య, వివేకానంద, నల్లపు చంద్ర, గంట వెంకట్, విద్యార్థులు, మేధావులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మాల సంఘాల నాయకులు, ఉద్యోగులు

కొత్త మెడికల్ కాలేజీలకు ఎసరు పెట్టొద్దు

- వాటిని ప్రైవేటుపరం చేయొద్దు
- విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన అర్థం చేసుకోండి
- దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, దర్శి ఎమ్మెల్యే

దర్శి: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్మించిన కొత్త మెడికల్ కళాశాలలకు ఎసరు పెట్టవద్దని దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకొచ్చి రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణం చేపట్టిందన్నారు. ఆ కళాశాలలు వద్దంటూ ప్రస్తుత చంద్రబాబు సర్కార్ కేంద్రానికి లేఖ రాయడం దుర్మార్గమన్నారు. వాస్తవానికి ఈ విద్యా సంవత్సరంలో మార్కాపురం, పులివెందుల, ఆదోని, మదనపల్లె, పాడేరులో ఒక్కో చోట 150 చొప్పున ఎంబీబీఎస్ సీట్లతో ఐదు కొత్త వైద్య కళాశాలలు ప్రారంభం కావాల్సి ఉందన్నారు. కొత్త వైద్య కళాశాలలు నెలకొల్పి మెడికల్ సీట్లు పెంచాల్సిన ప్రభుత్వమే వాటిని రద్దు చేయాలని లేఖ రాసిన పరిస్థితి ఒక్క ఏపీలో తప్ప దేశంలో ఎక్కడా లేదని చెప్పారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉంటే పేద, దళిత, బలహీన వర్గాలకు వైద్య విద్య అందుబాటులో ఉంటుందన్నారు. వాటిని ప్రైవేటుపరం చేస్తే ఆ విద్యకు వారు దూరమవుతారని తల్లిదండ్రులు, విద్యార్థులు పడుతున్న ఆవేదనను అర్థం చేసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటోందని బూచేపల్లి విమర్శించారు. ప్రభుత్వ నిర్ణయంతో 700 నుంచి 750 మంది విద్యార్థులు ఈ ఏడాది వైద్య విద్య చదివే అవకాశాన్ని కోల్పోనున్నారన్నారు. ఈ విద్యాసంవత్సరంలో 750 సీట్లకు అనుమతులిచ్చి ఉంటే అందులో 112 సీట్లు ఆలిండియా కోటా కింద పోగా, మిగిలిన సీట్లన్నింటిలో మన విద్యార్థులకు అవకాశం లభించేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ ప్రభుత్వం లేఖ రాయడంతోనే ఎల్‌ఓపీ రద్దు చేస్తున్నట్లు స్వయంగా ఎన్‌ఎంసీ ప్రకటించడంతో కూటమి సర్కారు మోసం బహిర్గతమైందన్నారు. కళాశాలల్లో మౌలిక వసతులు సమకూర్చుకునేందుకు మరి కొంత సమయం తీసుకోవాలని కేంద్రం ఉదారంగా ఆఫర్ ఇస్తే ఎవరైనా తిరస్కరిస్తారా అని శివప్రసాద్‌రెడ్డి ప్రశ్నించారు. తాము డాక్టర్లు కావాలని ఎన్నో ఆశలు పెట్టుకుని పేద విద్యార్థులు రేయింబవళ్లు కష్టపడి చదివి పరీక్షలు రాశారని, వారి ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లిందని బూచేపల్లి ఆవేదన వ్యక్తం చేశారు. ఆశించిన సీట్లు లేకపోవడంతో ఎంతో ఆశగా చదివించిన తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. కానీ, ప్రభుత్వం అర్థం చేసుకోకుండా మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయాలని ఆలోచించడం మంచి పద్ధతి కాదని మండిపడ్డారు. ఇలాంటి నిర్ణయాలు సామాన్యులకు వైద్య విద్యను దూరం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెనక్కు తీసుకుని విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కోరారు.

జీవో ఉపసంహరించుకునేంత వరకు పోరాటం

- పీహెచ్‌సీ వైద్యుల సంఘ జిల్లా అధ్యక్షుడు రాహుల్

ఒంగోలు టౌన్: ప్రాథమిక వైద్యశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న వైద్యుల భవిష్యత్తును దెబ్బతీస్తున్న జీవో నంబర్ 85ను పూర్తిగా రద్దు చేసేంత వరకు పోరాటం కొనసాగిస్తామని పీహెచ్‌సీ వైద్యుల సంఘ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాహుల్ తెలిపారు. ప్రాథమిక వైద్యశాలల్లో పనిచేసే వైద్యులకు పీజీలో ఇస్తున్న 30 శాతం రిజర్వేషన్లు కొనసాగించాలని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీ వైద్యులు విధులు బహిష్కరించినట్లు తెలిపారు. అయితే, వైద్యారోగ్యశాఖ కమిషనర్ తమ డిమాండ్ల విషయంపై రెండు రోజులు గడువు అడిగారని, ఆదివారం సాయంత్రం వరకు వేచి చూసి అప్పటికీ ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోతే ముందుగా నిర్ణయించినట్లు సోమవారం చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో 150 మంది ప్రాథమిక వైద్యశాలల వైద్యులు ఉన్నారని, రాష్ట్ర వ్యాప్తంగా 2,400 మంది వరకు ఉన్నారని చెప్పారు. తొలిసారిగా పీహెచ్‌సీ వైద్యులంతా ఐక్యంగా పోరాటానికి సిద్ధం కావడాన్ని బట్టి సమస్య తీవ్రతను అర్థం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

ఆటోను ఢీకొన్న జేసీబీ

● మహిళ మృతి, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు



మందా నాగమ్మ మృతదేహం

మద్దిపాడు: ఆటోను జేసీబీ ఢీకొన్న ప్రమాదంలో మహిళ మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం మధ్యాహ్నం లింగంగుంటలో జరిగింది. వివరాల్లోకి వెళితే..మండలంలోని పెద్దకొత్తపల్లి అరుంధతీవాడకు చెందిన మందా నాగమ్మ(40) తన కుమార్తెను బంగారు కమ్మలు చేయించుకునేందుకు ఆటోలో ఒంగోలు వెళుతుంది. అదే సమయంలో పేర్నమిట్ట నుంచి జేసీబీని మరమ్మతుల నిమిత్తం త్రోవగుంట వద్ద ఉన్న ఆటోనగర్‌కు వెళుతున్న శివశంకర్ వేగంగా ఆటోను ఢీకొట్టడంతో ఆటోలో ఉన్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మందా నాగమ్మకు కుడి కణితి వద్ద గాయాలవడంతో ఆమెను స్థానికులు ఒంగోలులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ప్రమాదంలో మార్లెళ్లకుంటకు చెందిన గుండే మేరీ, ఆమె కుమార్తె దీప్తి, మందా శివలకు గాయాలయ్యాయి. గాయపడిన ముగ్గురిని ఒంగోలులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు జేసీబీని సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోనికి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మద్దిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

122 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

పీసీపల్లి: మండల పరిధిలోని పెదఅలవపాడు పంచాయతీ కొత్తూరులో అక్రమంగా నిల్వ ఉంచిన 122 బస్తాల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఆర్‌వీఎస్ కృష్ణమోహన్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు డీలర్ నరసింహం ఇంట్లో తనిఖీ చేసి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేసి సీజ్ చేసిన బియ్యాన్ని షాప్ నంబర్‌లో-1లో ఉంచినట్లు తెలిపారు. దాడుల్లో వీఆర్‌ఓ మధుసూదన్ ఉన్నారు.

నులిపురుగులు నులిమేద్దాం



డీఎంహెచ్‌ఓ డాక్టర్ సురేష్ కుమార్

ఒంగోలు టౌన్: జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలందరికీ ఈ నెల 17వ తేదీన ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. జిల్లా వైద్యారోగ్య శాఖ కారాలయంలో శనివారం ముఖ్య అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏడాది నుంచి రెండేళ్లలోపు పిల్లలకు అర మాత్ర నీళ్లలో కరిగించి మింగించాలని, ఒక రోజు ముందే ఎంపీడీఓల ద్వారా ఆయా పాఠశాలలకు మందులను పంపిణీ చేయాలని సూచించారు. మందులు మింగిన తరువాత రెండు గంటల వరకు ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు పిల్లలను గమనిస్తూ ఉండాలని చెప్పారు. స్కూలు పిల్లల డైరీలో ముందుగానే నులిపురుగుల నివారణ కార్యక్రమం గురించి తలిదండ్రులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో బాల స్వస్థ్య కార్యక్రమం అధికారి డాక్టర్ భగీరథి దేవి పాల్గొన్నారు.

సముద్రంలో గుండెపోటుతో మత్స్యకారుడు మృతి


● మృతుడు తూర్పుగోదావరి జిల్లా తుని వాసి



మహంకాళి మృతదేహం

సింగరాయకొండ: సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు గుండెపోటుతో మృతి చెందిన సంఘటన సింగరాయకొండ మండలంలోని పాకల బీచ్‌లో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా తుని పట్టణంలోని మత్స్యకారపాలేనికి చెందిన గంట మహంకాళి (43) వినాయక చవితి పండుగను పురస్కరించుకుని సింగరాయకొండ మండలం పాకల పల్లెపాలెంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. శనివారం సముద్రంలో తన బంధువులతో కలిసి చేపల వేటకు వెళ్లాడు. సముద్రం లోపలికి వెళ్లిన తర్వాత గుండెనొప్పిగా ఉందని బోటులో కూర్చుని తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. దీంతో అతడిని వెంటనే ఒడ్డుకు తీసుకొచ్చి ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గం మధ్యలోనే మృతి చెందాడు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించనున్నట్లు చెప్పారు.

• భజే గణపతిం



ఒంగోలు గోపాల్‌నగర్ 4వ లైనులో..



గాంధీరోడ్డులో రూ.50 లక్షల విలువైన నోట్లతో అలంకరణ

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గణనాథుడ్ని రోజుకో అలంకరణ చేస్తున్నారు. శనివారం గాంధీరోడ్డులో గోల్డ్ సిల్వర్, డైమండ్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.50 లక్షల విలువైన నోట్లతో అలంకరించారు. కోర్టు సెంటర్‌లో ఎన్‌వీ జ్యూయలరీ షోరూం వద్ద బంగారు ఆభరణాలు, వెండి వస్తువులతో అలంకరించారు.



గోపాల్‌నగర్ 1వ లైన్ ఎక్స్‌టెన్షన్‌లో..



కోర్టు సెంటర్ ఎన్‌వీ జ్యూయలర్ వద్ద బంగారు ఆభరణాలు, వెండి వస్తువులతో మట్టి గణపతికి అలంకరణ

వేర్వేరు ప్రాంతాల్లో నలుగురు ఆత్మహత్య



చెట్టుకు ఉరేసుకున్న వెంకటేశ్వర్లు మృతదేహం



అనూషా మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై త్యాగరాజు



మృతి చెందిన జనమాల ఏసు

రాచర్ల: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉరేసుకొని నలుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే.. రాచర్ల గ్రామానికి చెందిన ఎనుముల వెంకటేశ్వర్లు (40) అనే వ్యక్తి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మెరుగైన వైద్యం నిమిత్తం నంద్యాలకు వెళ్లి వారం రోజుల పాటు వైద్యం చేయించుకుని ఇంటికి తిరిగి వస్తూ మనస్తాపానికి గురై రాచర్ల సమీపంలోని డంపింగ్ యార్డు ఆవరణలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య రంగమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత నెలలోనే మృతుడు తన చిన్న కుమార్తెకు వివాహం చేశాడని కుటుంబసభ్యులు తెలిపారు. సమాచారమందుకున్న ఎస్సై పి.కోటేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్కాపురంలో..

మార్కాపురం: వ్యక్తిగత కారణాలతో ఉరేసుకొని కార్పెంటర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పట్టణంలోని నాగులవరం రోడ్డులో శనివారం జరిగింది. భగత్‌సింగ్ కాలనీకి చెందిన కార్పెంటర్ ఏ వీరాచారి(23) నాగులవరంలో చెక్క పని చేస్తున్నాడు. అయితే శనివారం ఉదయం తాను పనిచేస్తున్న షాపులోనే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో తెలియడం లేదని కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

కనిగిరి మండలం వాగుపల్లిలో..

కనిగిరి రూరల్: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం కనిగిరి మండలం వాగుపల్లికి చెందిన బండారు అనుషా(26)కు పీసీ పల్లి మండలం ముద్దపాడుకు చెందిన శ్రీనుకు తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంత కాలంగా భార్యభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో అనూషా రెండు వారాల క్రితం పుట్టినిల్లు వాగుపల్లికి వచ్చి.. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.త్యాగరాజు తెలిపారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

పొదిలిరూరల్: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని కొండాయపాలెంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. జనమాల ఏసు(19) అనే యువకుడు ఆటో తోలుకొని జీవనం సాగిస్తున్నాడు. అయితే ఏమైందో ఏమో తెలియదు గానీ ఇంట్లో తల్లిదండ్రులు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోదరుడు గమనించి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. చేతికి వచ్చిన కుమారుడు మృతి చెందడంతో కుటుంబసభ్యుల రోదనలు చూపరులను కంతతడి పెట్టించాయి.

క్రికెట్ జట్టు ఎంపికకు విశేష స్పందన




ఎంపిక పోటీలను పరిశీలిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఒంగోలు: స్థానిక మంగమూరు డొంకలోని సబ్ సెంటర్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన అండర్ 14 బాలుర క్రీడా జట్టు ఎంపికకు విశేష స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి 90మంది క్రీడాకారులు హాజరు కాగా ప్రతిభ కనబరిచిన 33 మందిని ప్రాథమికంగా ఎంపిక చేశారు. వారికి బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం రావినూతల క్రికెట్ గ్రౌండ్‌లో రెండు రోజుల పాటు మ్యాచ్‌లు నిర్వహించి ప్రతిభ చూపిన 15 మందితో తుది జట్టు ఎంపిక చేస్తామని ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగిశెట్టి మోహన్‌దాస్, కారుసాల నాగేశ్వరరావు పేర్కొన్నారు. తుది జట్టుకు ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్ 1 నుంచి కడప, అనంతపురంలో జరిగే అంతర్‌జిల్లాల పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సెలక్షన్ ప్రక్రియను మాజీ రంజీ ప్లేయర్ తాటికొండ వంశీకృష్ణ, మాజీ స్టేట్ క్రీడాకారులు శ్రీకృష్ణ విజయకుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి ఎస్‌కే అనిల్, సంయుక్త కార్యదర్శి బచ్చు శ్రీనివాసరావు, అసోసియేషన్ సభ్యులు కొల్ల మధు, నవీన్, హనుమంతరావు, రామకృష్ణారెడ్డి, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు సాధించే వరకు పోరాటం

● తాలూకా ఎన్‌జీఓ సహకార గృహ నిర్మాణ సంఘ నాయకులు



మహాజన సభలో మాట్లాడుతున్న నేతలు

ఒంగోలు అర్బన్: రైల్వే స్థలాలు సాధించే వరకు పోరాటం తప్పదని ఒంగోలు తాలూకా ఎన్‌జీఓ సహకార గృహ నిర్మాణ సంఘ సభ్యులు స్పష్టం చేశారు. ఎన్‌జీఓ భవనంలో సొసైటీ అధ్యక్షుడు పాషాఖాన్, కార్యదర్శి ముగ్దుం షరీఫ్ అధ్యక్షతన శనివారం మహాజన సభ నిర్వహించారు. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ గత 35ఏళ్లుగా నివాస స్థలాల కోసం రైల్వే అధికారుల చుట్టూ తిరుగుతున్నా సాధించలేకపోయామన్నారు. రైల్వే బోర్డు నిర్ణయించిన ధరలు చెల్లించినా గత ఇరవై ఏళ్లుగా స్థలాలు సొసైటీకి అప్పగించలేదని రైల్వే అధికారుల కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. స్థలాలు సాధించే వరకు ధర్నాలు, ఆమరణ దీక్షలు నిర్వహించాలని సమావేశంలో సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆ మేరకు లెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలకు వినతిపత్రాలు ఇవ్వాలని, అనంతరం దీక్షలు ధర్నాలు చేపట్టి స్థలాలు సాధించే వరకు పోరాటం చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు సింగయ్య, కోటేశ్వరరావు, ఖాశీమ్, ప్రభాకరరావు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు కట్టే విషయంలో వివాదం

● కత్తితో దాడి..ఇద్దరికి గాయాలు



చికిత్స పొందుతున్న అనిల్‌కుమార్

పొదిలిరూరల్: ఫ్లెక్సీలు కట్టే విషయంలో జరిగిన గొడవ కారణంగా కత్తితో దాడి చేయడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని తలమల్ల గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే..గ్రామంలో ఫ్లెక్సీలు కట్టే విషయంలో పెదరామయ్య, చిన్న రామయ్య, వంకాయలపాటి అనిల్‌కుమార్, శ్యాం కోటి మధ్య వివాదం జరిగింది. ఈ క్రమంలో పెద రామయ్య, చినరామయ్య కలిసి కత్తితో దాడి చేయడంతో వంకాయలపాటి అనిల్‌కుమార్, శ్యామ్ కోటి ఇద్దరికిగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

16 నుంచి పవిత్రోత్సవాలు

సింగరాయకొండ: పురాణ ప్రసిద్ధి చెందిన పాత సింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈ నెల 16వ తేదీ సోమవారం నుంచి 19వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవస్థాన చైర్మన్ పామర్తి మాధవ రావు, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ఆలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయని, 19వ తేదీ సాయంత్రం జరిగే కార్యక్రమంలో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రధాన అర్చకులు ఉదయగిరి వెంకట లక్ష్మీ నరసింహాచార్యులు వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కమ్యూనిస్టు నేత పీవీఆర్ చౌదరి కన్నుమూత

● బస్సులోనే గుండెపోటుతో మృతి
● స్వగ్రామంలో అంత్యక్రియలు పూర్తి



పీవీఆర్ చౌదరి (ఫైల్)

ఒంగోలు టౌన్: ఒంగోలు నగర సీపీఐ కార్యదర్శి పీవీఆర్ చౌదరి (56) గుండెపోటుతో మరణించారు. శనివారం ఉదయం స్వగ్రామమైన పొందూరు నుంచి ఒంగోలు వస్తుండగా బస్సులోనే గుండెపోటు రావడంతో సీటులోనే మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కూమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తెకు వివాహం కాగా రెండో కుమార్తెకు ఈనెల 11న వివాహ నిశ్చితార్థం చేశారు. బీఏ, బీఈడీ చదివిన ఆయన విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులయ్యారు. ఏఐఎస్‌ఎఫ్‌లో చేరి విద్యార్థి ఉద్యమాల్లో క్రియాశీలకంగా వ్యవహరించారు. జిల్లా అధ్యక్షునిగా, ప్రధాన కార్యదర్శిగా, యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఏఐటీయూసీ నాయకుడిగా అనేక కార్మికోద్యమాలలో పనిచేశారు. ఒంగోలు నగరంలో ఎక్కడ ఎర్రజెండా కనిపిస్తే అక్కడ ప్రత్యక్షమయ్యేవారు. 2018లో గుండెపోటుకు గురైన ఆయనకు బైపాస్ సర్జరీ చేసివున్నారు. చౌదరి హఠన్మరణంతో సీపీఐతో పాటుగా వామపక్షాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు ఖిన్నులయ్యారు.

మంచి స్నేహితుడిని కోల్పోయాం..

సీపీఐ నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరి పార్థివదేహాన్ని నగరంలోని మల్లయ్య లింగం భవనం వద్ద ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం, ఇతర వామపక్ష పార్టీల నేతలు, వైఎస్సార్ సీపీ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య, ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య, ప్రజానాట్య మండలి గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు తన కుటుంబ సభ్యుడిని కోల్పోయినట్లుందని కన్నీరు పెట్టుకున్నారు. పలువురు నేతలు సంతాపం తెలిపారు.

జపాన్‌లో ఉద్యోగాలకు శిక్షణ

ఒంగోలు టౌన్: జపాన్‌లోని హాస్పిటళ్లలో వర్కర్స్ ఇన్ హాస్పిటల్స్, కేర్ హోమ్ ఫెసిలిటి ఉద్యోగాల కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నావిస్ హెచ్‌ఆర్ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి. రవితేజ యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్ చదివిన అభ్యర్థులకు జపనీస్ భాషను ఎన్5, ఎన్4, ఎన్3 స్థాయిల్లో నేర్పించి వారికి జపాన్‌లో ఉద్యోగావకాశాలను కల్పించనున్నట్లు వివరించారు. జపాన్‌లో పనిచేయడానికి ఆసక్తి కలిగిన అభ్యర్థులకు తొలుత జపనీస్ భాషలో 6 నెలల పాటు రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ఇస్తామన్నారు. బెంగళూరులోని హెచ్‌ఆర్ సంస్థ కార్యాలంలో తరగతులు జరుగుతాయన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామని, 32 ఏళ్ల వయసులోపు అభ్యర్థులు శిక్షణకు అర్హులని తెలిపారు. శిక్షణ నిమిత్తం రిజిస్ట్రేషన్ ఫీజు రూ.50,000 , శిక్షణ ఫీజు 3,00,000 కలిపి మొత్తం రూ.3,50,000 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజులో రూ.25 వేలను రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ చెల్లిస్తుందన్నారు. రూ.3 లక్షల ఫీజును మూడు విడతల వారీగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. శిక్షణ ఫీజు కోసం నావిస్ హెచ్‌ఆర్ సంస్థ రుణ సదుపాయాన్ని కలిగిస్తుందని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు జపాన్‌లో వైద్యశాలలో ఉద్యోగావకాశాలను కల్పిస్తామని నెలకు రూ.1,10,000 నుంచి రూ.1,40,000 వరకు ఇస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాకు చెందిన నర్సింగ్ శిక్షణ పొందిన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీడీపీ నేతల దుశ్చర్య

● వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడి ● మహిళకు గాయాలు.



ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న వర్షాబాయ్.

పుల్లలచెరువు: వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ వర్గీలు దాడిచేసిన సంఘటన మండలంలోని అక్కడపాలెంలో శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. అక్కపాలెం సుగాలి తండాకు చెందిన భార్యభర్తలైన వడితే వర్షాబాయ్, బ్రహ్మంనాయక్‌లు వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు. అక్కపాలెంలో ఈ నెల 12 వతేదీ గురువారం వినాయకవితి సందర్భంగా నిమజ్జనోత్సవం జరిగింది. అందులో భాగంగా తండా నుంచి కొందరితో పాటు ఈ ఇద్దరు కూడా ఊరేగింపులో పాల్గొని సాంప్రదాయ నృత్యాలు చేశారు. అయితే గ్రామానికి చెందిన కొందరు టీడీపీ వర్గీయులు మా గ్రామంలో పండుగ చేస్తే మీకు ఏంటిరా అని శుక్రవారం బ్రహ్మంనాయక్‌పై దాడికి పాల్పడ్డారు. అడ్డుపడిన భార్య వర్షాబాయ్‌పై కర్రలు, రాడ్లతో దాడి చేశారు. దీంతో వర్షాబాయ్‌కి తీవ్రగాయాలు అయ్యాయి. తలకు తీవ్రగాయమై 12 కుట్లు పడ్డాయి. ప్రస్తుతం ఆమె యర్రగొండపాలెం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతోంది.

గంజాయి ముఠా గుట్టురట్టు



స్వాధీనం చేసుకున్న గంజాయితో సీఐ, ఎస్సై

కొండపి (సింగరాయకొండ): గంజాయి తరలిస్తున్న 13 మంది సభ్యులు ఉన్న ముఠాను పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ సోమశేఖర్ వివరాలు వెల్లడించారు. కనిగిరి నుంచి కొండపి మీదుగా ఒంగోలు గంజాయి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు స్థానిక జాళ్లపాలెం రోడ్డులోని వాటర్ ట్యాంకు వద్ద నిందితులను అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 21 కేజీల గంజాయి, 20 కట్టల అల్యూమినియం తీగలను స్వాధీనం చేసుకున్నారు. కొండపి, ఇతర ప్రాంతాల్లో విద్యుత్, ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలకు పాల్పడింది వీరేనని తెలిపారు. గతంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో విద్యుత్‌మోటార్లు దొంగతనం చేసి కనిగిరిలో విక్రయించి జల్సాలు చేశారు. అయితే అవి సరిపోక గంజాయిని విక్రయిస్తున్నారు. నిందితులను కందుకూరు కోర్టులో హాజరుపరచారు. దాడిలో సీఐతో పాటు ఎస్సై కృష్ణబాజీ, ఏఎస్సై అంకారావు, హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు, సుధాకర్ శంకర్, రమేష్, కానిస్టేబుళ్లు ఉన్నారు. ముఠాను పట్టుకున్న పోలీస్‌సిబ్బందిని ఎస్పీ ఏఆర్ దామోదర్‌రావు ప్రత్యేకంగా అభినందించారు.